క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కొందుర్గు: మండల పరిధిలోని సంజీవపురం చింతల్ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగ సమయంలో ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్ మండలాలతోపాటు మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట, చౌడాపూర్ మండలాలకు చెందిన వివిధ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు.

17న మైసమ్మ తల్లికి బోనాలు

ఈ నెల 15నుంచి 18వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ తెలిపారు. 15న ధ్వజారోహణం, గణపతి హోమం, 16న స్వామివారి అభిషేకం 17న రథోత్సవం, పల్లకీసేవ అలాగే దేవాలయం ఆవరణలో వెలసిన మైసమ్మ తల్లికి బండ్లు, బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుంది. 18న స్వామివారి కల్యాణం, భజనలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

జీఓ 17ను రద్దు చేయండి

ఎన్‌పీఆర్‌డీ సంస్థ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి



షాద్‌నగర్: ఆసరా పెన్షన్‌ల మంజూరు కోసం ప్రభుత్వం విధించిన ఆదాయ పరిమితి జీఓ 17ను వెంటనే రద్దు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆసరా పెన్షన్‌ల మంజూరు కోసం ఆదాయ పరిమితిని విధిస్తూ జీఓను విడుదల చేసిందని అన్నారు. దీంతో చాలా మంది పెన్షన్లు రద్దు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకం కోసం చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారని ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున దివ్యాంగులకు ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి రుణాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక టీచర్లను నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలకు ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. కేశంపేట రోడ్డుకు చెందిన దంగు వెంకటేశ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయన సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే రూ.2లక్ష లు మంజూరు చేయించారు. శనివారం లబ్ధిదారుడికి మంజూరైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరు, నాయకులు రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న సినీ నిర్మాత బండ్ల గణేశ్

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం కౌన్సిలర్ లతాశ్రీ, శ్రీశైలంగౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామి వారి పల్లకీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లకీ సేవకు హాజరైన సినీ నిర్మాత బండ్ల గణేశ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్‌గౌడ్, వసంతరావు, దామోదర్‌రెడ్డి, రఘు, సతీశ్, ప్రవీణ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, కిషన్ నాయక్, నారాయణ, శ్రీనివాస్, గడ్డమీది రమేశ్, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, మల్లేశ్, గోరియా నాయర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు

కేశంపేట: మండల పరిధిలోని లింగంధన గ్రామంలో సాలాన ఉర్సే షరీఫ్‌లో భాగంగా శనివారం ఉర్సు ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సందల్, 16న చిరాగ్ నిర్వహించనున్నట్టు మహ్మద్ మౌలానా ఖాద్రి తెలిపారు. ఉర్సు ఉత్సవాలకు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సకల శుభాల సంక్రాంతి

సంక్రాంతి వచ్చిందంటే పల్లెల్లో కొత్త కాంతి వస్తుంది. గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలతో పండుగ వాతావరణం వెల్లివిరుస్తుంది. ఈ పండుగను మూడు నుంచి నాలుగు రోజుల పాటు జరుపుకోవడం మరో ప్రత్యేకత.

- వాకిళ్లలో ఆకర్షించే ముగ్గులు
- అలరించే గంగిరెద్దుల ఆటలు

షాబాద్: సంక్రాంతి అనగానే తెలుగింటి ఆడపడుచుకు వెంటనే గుర్తుకు వచ్చేవి ముగ్గులే. పండుగకు మూడు రోజుల ముందుగానే ప్రతీ వాకిలి రథం ముగ్గులతో కళకళాడుతుంటాయి. ఇళ్ల ముంగిట ముగ్గులు ఉంటే లక్ష్మీదేవికి ప్రీతికరమని ప్రజల నమ్మిక. స్త్రీల సృజనాత్మకతకు, కళాతృష్ణకు ప్రతీకలుగా రంగవల్లులను పేర్కొనవచ్చు.

తగ్గిన సందడి

పూల పొదరిళ్లు, రంగవల్లుల లోగిళ్లు, పిండివంటల ఘుమఘుమలు, కొత్త బట్టల సింగారాలతో సంక్రాంతి సంబురాలు జరుపుకుంటారు. ఇంటి ముందర ముగ్గులు వేసి పాలు పొంగించి పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారు. ఈ పండుగకు విశిష్ట అతిథి డూ డూ బసవన్న. గంగిరెద్దులను అందంగా ముస్తాబు చేసి ఇళ్ల ముందటకు తీసుకువచ్చి దీవెనలు ఇచ్చి దక్షిణ స్వీకరిస్తారు. హరిదాసులకు కలిగిన పంటలో దానం చేసి తృప్తి పొందుతారు. అన్ని రంగాల్లో అనిశ్చితి మరో వైపు ఏ వస్తువు కొనడానికి వెళ్లిన అధిక ధరలతో పండుగ చేసుకునేందుకు జంకుతున్నారు. ఈ పతంగుల సందడి అంతగా కనిపించడం లేదు.

కనుమ రోజున పశుపూజలు

సంక్రాంతి పండుగ తరువాతి రోజున కనుము పండుగను చేసుకుంటారు. పశువులను, కోడెదూడలను అలంకరించి, పూజించి వాటికి భక్షాలు తినిపించి మూగజీవాలపై రైతులు ప్రేమను కురిపిస్తారు. కనుమునాడు ఇంటికి వచ్చిన కూతుళ్లను, ఆడపడుచులను ప్రయాణాలు చేయనివ్వరు. కనుము పండుగ పీడ అని పలువురు అభివర్ణిస్తారు.



పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా ట్రస్టు ఆధ్వర్యంలో నమో మాతృమూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణులు, బాలింతలకు ఒక్కొక్కరికి నాలుగు ప్రొటీన్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవ చేయాలనే లక్ష్యంతో ట్రస్టు ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ఏడాదిపాటు కొనసాగిస్తామన్నారు. పౌష్టిక ఆహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఎదుగుతారని అన్నారు. బాలింతలకు కావాల్సిన ప్రొటీన్లు, విటమిన్లు లభిస్తాయని అన్నారు. సంపాందించిన దానిలో కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ భాస్కర్, మోహన్‌సింగ్, నర్సింహ, మురళి, ఆకుల ప్రదీప్, వంశీ, రుషి, నరేందర్, గణేశ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొటీన్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న దినేశ్‌రెడ్డి

చేవెళ్ల: క్రీడాకారులు తగిన ప్రోత్సాహం అందిస్తే ప్రతిభ చాటుతారని చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న చేవెళ్ల ఎల్లో ప్యాంచర్స్ జట్టుకు శనివారం ఎంపీపీ కుమారుడు దినేశ్‌రెడ్డి క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ఎం.జంగయ్య, శివ, ప్రకాశ్, గణేశ్, శ్రీనివాస్, ప్రశాంత్, సురేశ్ పలువరు నాయకులు ఉన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాలరెడ్డి

కేశంపేట: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల రెడ్డి అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, తూర్పుగడ్డతండా, సంతాపూర్ గ్రామాల్లో క్రికెట్ పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా విశాలరెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుతోపాటుగా క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొందుర్గు: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని తంగెళ్లపల్లి సర్పంచ్ బాల్‌రాజ్ అన్నారు. గ్రామంలో శనివారం నిర్వహించిన టీపీఎల్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ టీంకు మాజీ సర్పంచ్ రామకృష్ణ రూ.20వేల నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ బహుమతికి ఎంపికైన వలంటీర్ టీచర్స్ జట్టుకు సర్పంచ్ బాల్‌రాజ్ రూ.8వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింలుగౌడ్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



కొందుర్గు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఐరన్ పరిశ్రమను తొలగించండి

లేగదూడ కళేబరంతో పరిశ్రమ ఎదుట రైతుల ధర్నా

కేశంపేట: స్పాంజ్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమను తొలగించాలని శనివారం రైతులు, తండావాసులు ధర్నా చేపట్టారు. ఈ ఘటన ఇప్పలపల్లి రెవెన్యూ శివారులో చోటు చేసుకుంది. బాధితుడు గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. పొలాల మధ్య ఉన్న ఐరన్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పంటలు నాశనమవుతున్నాయని ఆరోపించారు. రాత్రివేళ కాలుష్యకారకాలను వదులుతుండడంతో పంటలు విషతుల్యమవుతున్నాయన్నారు. తూర్పుగడ్డతండా పంచాయతీ పరిధిలోని దేవునిగుడి తండాకు చెందిన కెత్రావత్ పోత్రం పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు చెందిన ఓ లేగదూడ చనిపోవడంతో లేగ దూడ కళేబరాన్ని పరిశ్రమ ఎదుట ఉంచి తండావాసులు, రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. కంపెనీ వెదజల్లుతున్న కాలుష్యం వల్లే తమ లేగదూడ మృత్యువాత పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిశ్రమను పొలాల మధ్య నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న సమయంలో పరిశ్రమ నిర్వాహకులు అసభ్య పదజాలంతో దూషించారని వాపోయారు.



మృతి చెందిన లేగదూడను కంపెనీ ఎదుట ఉంచిన రైతు

వైభవంగా గోదాదేవి కల్యాణం

మొయినాబాద్‌రూరల్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. శనివారం ఆలయ ప్రాంగణంలో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వారికి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్య నిర్వాహకుడు బుచ్చిరెడ్డి అన్ని ఏర్పాట్లు చేయించారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు మండల పరిధిలోని చాకలిగూడ గ్రామానికి చెందిన సిద్ధి కుమార్ దంపతులు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో సర్పంచ్ మంజుల దంపతులు

అనాథ చిన్నారులను ఆదుకోవాలి



అనాథ శరణాలయంలో చిన్నారులతో పెండ్యాల సాయిమాలిక్ తదితరులు

రాజేంద్రనగర్: అనాథ చిన్నారులకు అండగా నిలవాలని శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు పెండ్యాల సాయిమాలిక్ అన్నారు. సేవా సమితి కో చైర్మన్ పెండ్యాల ఆదిత్య జన్మదినాన్ని ఆరాధన బాలల అనాథ శరణాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పండ్లు, స్టేషనరీ అందజేశారు. అనంతరం వారికి మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు.

అయ్యప్ప ఆలయంలో మకరజ్యోతి పూజలు

చేవెళ్ల: మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం మకరజ్యోతి పూజలు నిర్వహించారు. ఉదయం 6గంటలకు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, తీర్థ ప్రసాద వితరణలు నిర్వహించారు. సాయంత్రం 4గంటల నుంచి పడిపూజ భజనలతో సాయంత్రం 6.30గంటలకు జ్యోతి దర్శనం పూజలు చేశారు. ఆలయ పరిసరాలన్నీ అయ్యప్ప స్వామి వారి నామస్మరణతో మార్మోగాయి.



ప్రత్యేక అలంకరణ చేస్తున్న ఆలయ అర్చకుడు

ఎక్స్‌ప్రెస్ వేపై యథేచ్ఛగా..

అనుమతి లేకున్నా పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు





రాజేంద్రనగర్: పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్ర వాహనదారులు యథేచ్ఛగా ప్రయాణం చేస్తున్నారు. కేవలం కార్లకు మాత్రమే ఈ ఎక్స్‌ప్రెస్ వేపై అనుమతి ఉండగా కొందరు ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ రద్దీ నుంచి తప్పించుకునేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. గతంలో సరోజినీదేవి కంటి ఆసుపత్రి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు 11 కిలోమీటర్ల మేర భారీ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించారు. ట్రాఫిక్ జామ్‌ను నివారించేందుకు నగరం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రయాణించేందుకు దీనిని ఏర్పాటు చేశారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఉంది. భారీ వాహనాలు, బస్సులు, ట్రక్కులు, ద్విచక్ర వాహనాలను నిషేధించారు. కానీ ప్రతి రోజు ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. 80–100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు అడ్డంగా వస్తుండడంతో అసౌకర్యం కలుగుతోంది. ప్రమాదాలు జరగక ముందే పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కార్ల యజమానులు కోరుతున్నారు.ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి ప్రాంతాల్లో గతంలో ద్విచక్ర వాహనాలు ఈ ఎక్స్‌ప్రెస్ వేపై ప్రయాణిస్తు మృత్యువాత పడ్డ సంఘటనలు గుర్తు చేస్తున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలీస్ కమిషనర్‌కు శుభాకాంక్షలు



పోలీస్ కమిషనర్ శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కిషోర్

షాద్‌నగర్: హైదరాబాద్ సంయుక్త పోలీస్ కమిషనర్ శ్రీనివాసులను శనివారం షాద్‌నగర్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్ కలిశారు. సంక్రాంతి సందర్భంగా ఒగ్గు కిషోర్ హైదరాబాద్‌లో సంయుక్త పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నిందితుడి అరెస్టు..

రెండు కంప్యూటర్లు స్వాధీనం

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీ నుంచి కంప్యూటర్లు తీసుకు వెళ్లిన కాంట్రాక్టు ఉద్యోగి చంద్రశేఖర్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి రెండు కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్ నేషనల్ పోలీస్ అకాడమీలో కాంట్రాక్టు పద్ధతిపై కంప్యూటర్‌ల నిర్వహణ చూస్తుంటాడు. ఇందులో భాగంగా మరమ్మత్తులకు గురైన వాటిని అక్కడే బాగు చేయడంతో పాటు ఇంటికి తీసుకువెళ్లి బాగు చేస్తుంటాడు. మూడు నెలల క్రితం ఎన్‌పీఏ ఔట్ పోస్టు రికార్డులో ఏడు కంప్యూటర్లు తీసుకువెళ్లినట్లు నమోదై ఉంది. కాగా చంద్రశేఖర్ మూడు నెలలుగా విధులకు హాజరుకావడం లేదు. దీనిపై రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు చంద్రశేఖర్‌ను శనివారం ఉదయం బాలాపూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. మద్యానికి బానిసైన చంద్రశేఖర్ విష్ణు అనే వ్యక్తికి కంప్యూటర్లను అమ్మినట్లుగా చెప్పాడు. విష్ణు కోసం పోలీసులు గాలిస్తున్నారు. చంద్రశేఖర్‌ను పోలీసులు సాయంత్రం రిమాండ్‌కు తరలించారు.

భోగి పండుగ సంబురాలు



షాబాద్: కుమ్మరిగూడలో భోగి మంటలు



మొయినాబాద్‌రూరల్: అమ్మకానికి ఉంచిన గాలి పటాలు

చేవెళ్ల/షాబాద్: మండల పరిధిలో శనివారం భోగి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ముందు కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేశారు.

ఎగురుతున్న గాలిపటాలు

మొయినాబాద్ రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నాయకులు, యువకులు గాలిపటాలను ఎగరవేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని పతంగుల దుకాణాల్లో స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ నాయకులు, సినీహీరోల చిత్రపటాలతో రూపొందించిన పతంగులు ఆకర్షించాయి.

హామీలన్నీ నెరవేరుస్తా: సుంకిరెడ్డి

మాడ్గుల: ప్రజల మధ్యలో ఉంటూ వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడితండాలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను శనివారం స్థానిక సర్పంచ్ నేనావత్ స్వప్నతో కలిసి రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం యువకులకు క్రికెట్ కిట్ అందజేశారు. ఇటీవల గుడితండాకు వచ్చిన సమయంలో తండా ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజనులు సుంకిరెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని అన్నారు. ఫౌండేషన్ తరఫున ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శోభ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి భూమిపూజ



పిల్లోనిగూడలో పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ బుచ్చమ్మ, దాతలు

శంషాబాద్ రూరల్: దాతల సాయంతో నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల భవనానికి శనివారం భూమి పూజ చేశారు. మండలంలోని పిల్లోనిగూడలో నిర్మల్ ఫౌండేషన్ రౌండ్‌టేబుల్ ఇండియా సహకారంతో కొత్త భవనాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ బుచ్చమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాతలు అభిషేక్ అగర్వాల్, కె.బస్వాల్, కిషోర్ అగర్వాల్, సోనియా కర్మన్, అభిషేక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధకృష్ణ, ఉపసర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.